క్లుప్తంగా

నేడు భీమేశ్వరస్వామి వారి హుండీ కానుకల లెక్కింపు

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ తనిఖీ అధికారుల సమక్షంలో ఈ లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

సెలవు రోజు కూడా పన్ను బకాయిలు చెల్లించవచ్చు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను, నీటి పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ ఇచ్చిన దృష్ట్యా ఈనెల 31వ తేదీ వరకు ఏక మొత్తంలో పన్ను బకాయిలు చెల్లించేవారు వడ్డీ రాయితీ పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉన్నప్పటికీ పన్ను స్వీకరణకు కార్యాలయ ఉద్యోగులు అందుబాటులో ఉంటారని, కావున పన్ను చెల్లించేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పదవ తరగతి విద్యార్థులకు ఉచిత రవాణా

గుడివాడటౌన్: త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్ సర్వీస్‌లు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో రవాణా వసతులు లేని మోపర్రు, చిగురుకోట, దోసపాడు తదితర ప్రాంతాల నుంచి పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన ప్రాంతాలను ఎంపిక చేశామని మరి ఏ ఇతర ప్రాంతాలలోనైనా ప్రయాణ వసతులు లేని పక్షంలో తమ దృష్టికి తెస్తే బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేకించి ఒక రూటులో ప్రయాణించే విద్యార్థులే కాక హాల్ టికెట్ ఉన్న ఏ విద్యార్థి అయినా ఈ బస్సులో ఉచితంగా ప్రయాణం చెయ్యవచ్చన్నారు.

నందివాడ విద్యుత్ శాఖ ఏఈగా ఫణీంద్ర



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండల విద్యుత్ శాఖ ఏఈగా టి.ఫణీంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కేజీ మార్కెట్ పరిధిలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారని ఎలక్ట్రికల్ ఏడీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు



జుఝవరం(పామర్రు): గ్రామంలోని ఉషోదయ హైస్కూల్‌లో మంగళవారం కరాటే బెల్టు టెస్టు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో గ్రీన్ బెల్టు నలుగురు, ఆరెంజ్ బెల్ట్ 13 మంది, ఎల్లో బెల్ట్ ఒకరు సాధించారు. బ్లాక్ బెల్ట్ సెవెన్త్ డాన్ ఎస్.వెంకటేశ్వరరావు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించి బెల్టులను బహూకరించారు. బెల్టులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వీవీఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్ రఫీ, ఉపాధ్యాయులు అభినందించారు.

చెక్‌పోస్టు రికార్డుల్లో కచ్చితత్వం ఉండాలి

కైకలూరు: మార్కెట్ యార్డు పరిధిలో పనిచేస్తోన్న చెక్‌పోస్టు రికార్డుల్లో కచ్చితత్వం పాటించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత అన్నారు. ఏఎంసీ పరిధిలో కైకలూరు, పెదఎడ్లగాడి, ముదినేపల్లి చెక్‌పోస్టులను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

మండవల్లి: స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈనెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు మండల స్వశక్తి సంఘాల మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు విచ్చేస్తారని ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్ తెలిపారు.

అక్క,చెల్లెమ్మలకు కొండంత ఆసరా

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- 810 సంఘాలకు రూ.8.13 కోట్ల చెక్కు అందజేత
- భారీగా తరలివచ్చిన డ్వాక్రా మహిళలు



తోట్లవల్లూరులో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



తోట్లవల్లూరు సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

తోట్లవల్లూరు: డ్వాక్రా అక్క,చెల్లెమ్మలకు కొండంత ఆసరాగా ఉండేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ తెలియజేశారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే మహోన్నత లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని ఆయన అన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు, పచ్చచొక్కాలకే పరిమితమైన సంక్షేమ పథకాలను నేడు కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న సంస్కరణలు తీసుకురావటంతోపాటు మన బడి నాడు-నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు.

సంక్షేమ పథకాలు ఆపే దమ్ముందా?

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పప్పు బెల్లాల్లా డబ్బును పంచేస్తున్నారని గొంతు చించుకుంటున్న ప్రతిపక్ష టీడీపీకి, ఆ పార్టీ నాయకులకు తాము అధికారంలోకి వస్తే వాటిని నిలిపి వేస్తామని చెప్పే దమ్ముందా అంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రశ్నించారు. కల్లబొల్లి కబుర్లు, మోసకారి మాటలతో దుష్ప్రచారం చేసే ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం జగనన్నకు డ్వాక్రా అక్క, చెల్లెమ్మలంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి అనిల్‌కుమార్ క్షీరాభిషేకం నిర్వహించటంతోపాటు కేక్‌ను కట్ చేశారు. మండల వ్యాప్తంగా 810 డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.8.13 కోట్ల చెక్కును అందజేశారు.

ఇళ్ల స్థలాల కోసం భూమి పరిశీలన

తోట్లవల్లూరులో నివేశన స్థలాల పంపిణీ కోసం సేకరించనున్న భూమిని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పరిశీలించారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో రోడ్డులో 8.90 ఎకరాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన సందర్శించి భూమి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వెలుగు ఏపీఎం కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పీఎస్ కోటేశ్వరరావు, సోలే నాగరాజు, దేవరపల్లి చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



వృద్ధురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పసుమర్రు(పామర్రు): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన అందిస్తోందని పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్ కుమార్ అన్నారు. పామర్రు మండలం పసుమర్రు సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకుని అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.అశోక్‌కుమార్, పార్టీ నాయకులు పెయ్యలరాజు, ఎస్.సింహాచలం, బి.మధుసూదనరెడ్డి, కొణతం శ్రీనివాసరావు, శామియ్యేలు, జుఝవరపు చిన్ని, వెంకటేశ్వరరావు, జె.జ్యోతి, ఎంపీడీవో వై.రామకృష్ణ, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వేదిక గడపగడపకు

ఎమ్మెల్యే డీఎన్నార్



పోతుమర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం పోతుమర్రు గ్రామ పరిధిలో దుంపలకోడుదిబ్బ, పరమానందునిపేటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులను నిర్మించాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, సర్పంచ్ గొర్ల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పెదపారుపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరుకావాలన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. వెంట్రప్రగడ గ్రామంలో ఉన్న లేఅవుట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద ఉన్న లబ్ధిదారులతో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు చేసే సమయంలో నీళ్లకు ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు చెప్పగా, స్పందించిన ఆయన పైఅధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు వెంటనే మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రమణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షహనాజ్, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి తదితరులు పాల్గొన్నారు.

• తిరుక్కల్యాణోత్సవాలకు శ్రీకారం

ముదినేపల్లిరూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామస్వామి ఆలయ తిరుక్కల్యాణ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీతారాములను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించారు. స్వామివారి గర్భాలయంలో ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన అర్చకుడు ఆసూరీ రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా 30న శ్రీరామనవమి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు చైర్మన్ మీగడ నెలబాలుడు తెలిపారు. కల్యాణాన్ని వీక్షించేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

• చిరుధాన్యాలలో పోషక విలువలు

కనుమూరు(పామర్రు): చిరుధాన్యాలలో పోషక విలువలు ఉంటాయని, చిరు ధాన్యాల ప్రాధాన్యాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలని కనుమూరు ఎంపీటీసీ యార్లగడ్డ పావని, గ్రామ సర్పంచ్ కొడాలి సుఖవేణి తెలిపారు. మండలంలోని కనుమూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది వేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమ చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు కలిగిన సమతుల ఆహారం చిరుధాన్యాల వలనే సాధ్యం అవుతుందని, ఈ నేపథ్యంలో వీటిని రోజూ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ పి.సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పలత, ప్రసన్న, సహాయకులు అమలేశ్వరి, శోభనా కుమారి, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

• పశువులకు టీకాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరు పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ బి.జోజిబాబు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 25 వరకు ఈ టీకాలు వేస్తామన్నారు. వైద్యశాల పరిధిలోని పెదగొన్నూరు, కొరగుంటపాలెం, అల్లూరు, ఈడేపల్లి, ములకలపల్లి, బొమ్మినంపాడు, వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో వచ్చే 25 వరకు టీకాలు వేస్తామని చెప్పారు. టీకాలు వేసే రోజుల్లో వైద్యశాలను మూసివేస్తామని, పశువులకు అత్యవసర వైద్యం కోసం సెల్ నంబర్ 99639 36173లో సంప్రదించాలని కోరారు.

• పౌష్టికాహారంతో ఆరోగ్య సంరక్షణ

ముదినేపల్లిరూరల్: గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారంతోనే ఆరోగ్య సంరక్షణ చేకూరుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి అన్నారు. మండలంలోని గురజ వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో 6 రకాల పోషక పదార్థాలను అందిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాల మిల్లెట్ వంటకాలను ప్రదర్శించి వాటిలో ఉండే పోషకాల గురించి వినియోగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ ఆనందబాబు, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, వైద్య అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు సంచార వైద్య సేవలు

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు సీహెచ్‌సీలో 104 వాహన సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండు పర్యాయాలు ఫ్యామిలీ డాక్టరు పథకంలో భాగంగా 104 వాహనంలో వైద్యులు ఇంటింటి సేవలు అందిస్తారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో నియోజకవర్గానికి అదనంగా వచ్చిన మూడు 104 వాహనాలను ఆయన మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు వాహనాలు ఉన్నాయని, మరో మూడు వాహనాలు రావడంతో వైద్య సేవలు మరింత పెరుగుతాయని చెప్పారు. త్వరలో ఇంకో రెండు వాహనాలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం ప్రపంచ ఓరల్ హెల్త్ డేను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దూలం వీర శ్యామ్ ఫణికుమార్, మీగడ వెంకట కృష్ణారావు, నెక్కల శ్యామల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరకువాడ బలరామరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండరాజు, ఆసుపత్రి సూపరింటెండెంటు రాంబాబు, వైద్యులు శివశంకర్, హేమలత, నాయకులు నిమ్మల సాయి, దండే రవిప్రకాష్, కూనవరపు సతీష్, సమయం రామాంజనేయులు, బోడిచర్ల సురేష్ పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్న జగన్



మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శశిభూషణ్

గుడ్లవల్లేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుని మాట తప్పని మడమ తిప్పని నేతగా చరిత్రలో నిలిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. గుడ్లవల్లేరు మండలంలోని 974 డ్వాక్రా గ్రూపుల్లోని 9,577 మంది మహిళలకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా కింద మంగళవారం గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్ర కల్యాణ మండలంలో రూ.9,76,026 చెక్కును ఆయన అందజేశారు. చంద్రబాబు డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసిన చరిత్ర ఆయనకు ఉందన్నారు. టీడీపీ హయాంలో గుడ్లవల్లేరు మండలంలో రూ.కోటి వరకే స్త్రీ నిధిని పొదుపు సంఘాలకు ఇచ్చారని గుర్తు చేశారు. కాని జగన్ పాలనలో రూ.5 కోట్ల పైచిలుకు ఇచ్చారన్నారు. బాబు హయాంలో గ్రూపుల నుంచి 13 శాతం వడ్డీని వసూలు చేశారన్నారు. జగన్ పాలనలో కేవలం 7 శాతమే వడ్డీ ఉన్నట్లు తెలిపారు. అనంతరం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కొత్తూరి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు డోకాల కనకరత్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్, ఏపీఎం సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. సెల్ ఫోన్లకు దూరంగా ఉండండి



కైకలూరు బీసీ బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి షణ్ముఖరావు

కై కలూరు: విద్యార్థులు సెల్ ఫోన్లకు ఆకర్షితులు కాకుండా చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కై కలూరు బీసీ బాలికల కాలేజీ హాస్టల్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై వార్డెన్ ఎం.రాధ నుంచి వివరాలు తెలుసుకున్నారు. హాస్టల్ వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.వసన్‌కాంత్, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణను సన్మానించిన శశిభూషణ్, చంటి

గుడ్లవల్లేరు: మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా కొత్తూరి లక్ష్మీనారాయణను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎంపిక చేశారు. ఈమేరకు మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దుక్కిపాటి శశిభూషణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను గుడ్లవల్లేరులో వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు డోకాల కనకరత్నారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి 108 రజత పుష్పాలు



రజత పుష్పాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గుడివాడటౌన్: స్థానిక జగన్నాధపురంలోని పాటిమీద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు 108 బంగారుపూతతో కూడిన రజత తామర పుష్పాలు బహూకరించినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజ్‌కుమార్ దంపతులు వీటిని స్వామి వారికి సమర్పించినట్లు తెలిపారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామి వారి సన్నిధిలో వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారికి నిర్వహించే అష్టదళ పాదపద్మ పూజలను శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రారంభిస్తున్న సందర్భంగా వీటిని స్వామి వారికి సమర్పిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు వేదాంతం అప్పలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జయమంగళకు శుభాకాంక్షలు



కై కలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్సీగా విజయం సాధించిన జయమంగళ వెంటకరమణకు ఆటపాకలో మంగళవారం ఆయన నివాసం వద్ద పలు గ్రామాల ప్రజలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి సీఎం కృత నిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుడైన రైతు మురారి వెంకటేశ్వరరావు (పెదపూడి) ఇటీవల మృతి చెందాడు.ఆ రైతు భార్య వెంకటరత్నంకు మట్టి ఖర్చుల నిమిత్తం మంగళవారం రూ.10వేలను సొసైటీ చైర్‌పర్సన్ కైల శ్రీవల్లి చేతుల మీదగా అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: పేకాట శిబిరంపై దాడి జరిపి పలువురు జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. గ్రామంలోని మొక్క జొన్న తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం తెల్లవారుజామున దాడి జరిపి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకోవటంతోపాటు రూ. 5,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.రమేష్ తెలియజేశారు.